క్లుప్తంగా

డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్ కోర్సుపై శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాల శిక్షణ సంస్థలో డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్ కోర్సులో ఉచిత శిక్షణను అందిస్తున్నట్లు కొండపి స్కిల్ హబ్ సెంటర్ కో ఆర్డినేటర్ గోపీకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్‌లో కూడా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు నెలల పాటు జరిగే శిక్షణకు అభ్యర్థులు 10వ తరగతి చదివి ఉండాలన్నారు. ఈ నెల 28వ తేదీన శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. ఇతర పూర్తి వివరాలకు 88979 64505 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

శివాలయానికి విరాళాలు



రూ.50 వేలు అందజేస్తున్న నాగేశ్వరరావు

ఒంగోలు మెట్రో: ఒంగోలు రంగారాయుడు చెరువు వద్ద పునర్నిర్మాణంలో ఉన్న భువనేశ్వరి సమేత పశుపతీశ్వర స్వామి దేవస్థానా (శివాలయం)నికి ఒంగోలు రాజీవ్ నగర్లో నివాసం ఉంటున్న చుండి నాగేశ్వరరావు తన సతీమణి రమాదేవి జ్ఞాపకార్థం ఆయన శివాలయానికి రూ.50 వేల విరాళం ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్యకు గురువారం సాయంత్రం వారి నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా మహంకాళి శేషయ్య మాట్లాడుతూ పునర్నిర్మాణంలో ఉన్న శివాలయానికి భక్తులంతా తమ వంతుగా సహాయం సహకారాలు అందించాలని కోరారు. చుండి కుటుంబ సభ్యుడు కప్పర రామ కుమారు శర్మ పాల్గొన్నారు.

రేపు శ్రీగిరిలో ఆలూరు కాంస్య విగ్రహ ప్రతిష్ఠాపన

ఒంగోలు మెట్రో: ప్రముఖ పారిశ్రామికవేత్త, సీరజా గ్రూపు సంస్థల అధినేత దివంగత ఆలూరు వెంకట రమణారావు కాంస్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఈ నెల 25వ తేదీ శనివారం ఉదయం పది గంటలకు శ్రీగిరిలో నిర్వహిస్తున్నట్లు కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పరిపాలిత శ్రీగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ఆలూరు జయశంకర్ వెల్లడించారు. ఆలూరు వెంకట రమణారావు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ పాల్గొంటారు.

అలరించిన పాండురంగం భజే నత్య రూపకం



ఇంద్రప్రస్థం నాటికలో ఓ సన్నివేశం

ఒంగోలు మెట్రో: స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల మునిసిపల్ పబ్లిక్ గ్రౌండ్లో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాల్లో భాగంగా గురువారం ఐదో రోజు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఇందులో భాగంగా నాదస్వరం, కోలాట ప్రదర్శన, నాటిక, నృత్యరూపకం, చర్చాగోష్టి కార్యక్రమాలు ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు, కార్యదర్శి అన్నమనేని ప్రసాద్‌రావు పర్యవేక్షణలో జరిగాయి.

26న ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు

చీమకుర్తి: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాలకు నిరసనగా ఈ నెల 26న తలపెట్టిన రైతుల ట్రాక్టర్స్, బైకుల ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘ జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు పిలుపునిచ్చారు. గురువారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం నాయకులు, రైతు సంఘ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్రావు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ చట్టాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. ప్రధాని మోదీ ఢిల్లీలో జరిగిన రైతుల ఒప్పందంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా వ్యవసాయ సహకార రంగాన్ని కార్పొరేట్ల చేతుల్లోకి తీసుకుపోయే విధంగా ప్రమాదకర చట్టాలను తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, వ్యవసాయ విధానాలపై మోదీ వైఖరిని ఎండగడుతూ ఈ నెల 26న చేపట్టిన ట్రాక్టర్స్, బైకుల ర్యాలీలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బెజవాడ శ్రీనివాసరావు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంతా అవినీతే..!

- సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి పనికీ ఒక రేటు
- లంచం ఇస్తేనే పనులు.. లేకుంటే లేదు..!
- ఆందోళన చెందుతున్న ప్రజలు



సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

సంతనూతలపాడు: సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ఇప్పటికే అనేక ఆరోపణలు ఉన్నప్పటికీ.. అవినీతి అక్రమాలకు ఇక్కడ బ్రేకులు పడటం లేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అవినీతి అధికారులపై ఒక వైపు వేటు పడుతున్నా.. మరోవైపు ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నా.. సంతనూతలపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తీరు మారడం లేదు. అవినీతిపై టోల్ ఫ్రీ నంబర్ 14400 కాల్ సెంటర్‌కు జిల్లా నుంచి అందుతున్న ఫిర్యాదుల్లో రిజిస్ట్రేషన్ శాఖ మూడో స్థానంలో ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ దృష్టి సారించింది. అయినప్పటికీ.. దళారులను అడ్డం పెట్టుకుని అవినీతి అధికారులు యథేచ్ఛగా దోపిడీ కొనసాగిస్తున్నారు. అవినీతి జలగల్లా మారి క్రయవిక్రయదారులను పీల్చిపిప్పిచేస్తున్నారు. అవినీతి సొమ్ముకు అలవాటు పడిన వీరు.. దొరికిన కాడికి అడ్డంగా దోచేస్తున్నారు. డబ్బు ముట్టజెబితే నిషేధిత జాబితాలోని భూములను సైతం రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధమైపోతున్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లకు భారీ మొత్తంలో వసూలు చేస్తున్నట్లు సమాచారం. చేయితడపకపోతే చిన్నచిన్న కారణాలు చూపించి రిజిస్ట్రేషన్లకు కొర్రీలు వేస్తున్నారు.

ఏ పని కావాలన్నా దళారీలతో వెళ్లాల్సిందే..

సంతనూతలపాడు రిజిస్ట్రార్ కార్యాలయంలో పొలాలు, స్థలాలు, ఇళ్ల రిజిస్ట్రేషన్లతో పాటు భూముల ఈసీలు, డాక్యుమెంట్ నకళ్లు, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీ), వీలునామా, మ్యారేజ్ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఏ పని అయినా దళారీలతోనే సంతనూతలపాడు రిజిస్ట్రార్ కార్యాలయంలోకి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వారి ద్వారా అధికారులకు అడిగినంత సమర్పించుకోవాల్సి ఉంది. అలా కాదని నేరుగా వెళ్లి పనిచేయించుకోవడానికి ఎవరైనా ప్రయత్నిస్తే అనేక కొర్రీలు పెట్టి వెనక్కు తిప్పి పంపించివేస్తారు. ఎందుకు వచ్చిన తలనొప్పి అని సామాన్య ప్రజలు సైతం దళారీ వ్యవస్థకు అలవాటుపడిపోయారు.

పక్కాగా అదనపు దోపిడీ...

సంతనూతలపాడు రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులతో పాటు అదనపు దోపిడీ పక్కాగా జరుగుతోంది. రోజంతా చేసిన వసూళ్లను సాయంత్రానికి అధికారుల నుంచి అటెండర్ వరకు స్థాయిని బట్టి పంచుకుంటారు. భూములు, స్థలాల రిజిస్ట్రేషన్లో సబ్ రిజిస్ట్రార్‌కు మార్కెట్ విలువలో ఒక శాతం అదనంగా చెల్లించాలి. గిఫ్ట్ డీడ్‌కు అర శాతం, పార్టిషన్ (అన్నదమ్ముల భూ పంపకాలు)కు అర శాతం వసూలు చేయడం బహిరంగంగానే జరుగుతోంది. ఉదాహరణకు 100 అంకణాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే మార్కెట్ విలువ ప్రకారం అంకణం రూ.12,000 చొప్పున రూ.12 లక్షలకు ఒక శాతం అంటే.. రూ.12 వేలను సబ్ రిజిస్ట్రార్‌కు అనధికారికంగా చెల్లించాలి. అలా చేస్తేనే సకాలంలో రిజిస్ట్రేషన్ జరుగుతుంది. లేదంటే ఎన్నో కొర్రీలు పెట్టి చుక్కలు చూపిస్తారు. ప్రభుత్వ రుసుం సేల్ డీడీ బ్యాంకుల్లో చెల్లింపులు చేసిన తర్వాత అదనపు వసూలు మాత్రం పక్కాగా ఇవ్వాలి. ఇదంతా డాక్యుమెంట్ రైటర్ ద్వారా బహిరంగంగానే జరుగుతోంది. కానీ, ఎవరూ పట్టించుకోకపోవడంతో లంచాలు ఇచ్చుకోలేని సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సామాన్య ప్రజలకు సైతం నేరుగా పనులు జరిగేలా సేవలను అందుబాటులోకి తీసుకురావాలని, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని సంతనూతలపాడు మండల ప్రజలు కోరుతున్నారు.



బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మేరుగు నాగార్జునను మర్యాదపూర్వకంగా కలిసిన పార్టీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ శ్రేణులతో బూచేపల్లి, మేరుగు సమీక్ష

చీమకుర్తి: జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున గురువారం చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే అంశాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. అనంతరం నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షునిగా నియమించబడిన బొడ్డు కోటేశ్వరరావు, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా నియమించబడిన మక్కెన రాజేంద్రకుమార్ మర్యాదపూర్వకంగా బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి, మేరుగు నాగార్జునను కలిసి శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాల కన్వీనర్లు పమిడి వెంకటేశ్వర్లు, క్రిష్టిపాటి శేఖరరెడ్డి, దుంపా చెంచిరెడ్డి, పోలవరపు శ్రీమన్నారాయణ, చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, గోపురపు చంద్ర, పెరికల నాగేశ్వరరావు, పులి వెంకటరెడ్డి, గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పాలడుగు సుబ్బారావు, కుంచాల రాంబాబు, బొంతా సంతోష్, తెల్లమేకల గాంధీ, స్థానికులు పాల్గొన్నారు.



ఆంజనేయులకు నివాళులర్పిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాదరెడ్డి

శీలం ఆంజనేయులకు ఘన నివాళులు...

చీమకుర్తి చేనేత సొసైటీ మాజీ అధ్యక్షుడు శీలం ఆంజనేయులకు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ ఘనంగా నివాళులర్పించారు. చేనేత సొసైటీ ద్వారా పద్మశాలీయుల కుటుంబాలకు, పార్టీకి శీలం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



అప్పారావును పరామర్శిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున



కందుల దానియేలు కుటుంబానికి పరామర్శ

- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: కుటుంబ సభ్యులను కోల్పోయిన పార్టీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు తాను నిరంతరం అండగా ఉంటానని మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున భరోసా ఇచ్చారు. ఇటీవల యువతి మోసం చేయడంతో ప్రేమ విఫలమై ఆత్మహత్యకు పాల్పడిన కందుల ప్రవీణ్ తండ్రి కందుల దానియేలు కుటుంబాన్ని మేరుగు నాగార్జున గురువారం ఉప్పుగుండూరులో పరామర్శించారు. దానియేలు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా అమ్మనబ్రోలు గ్రామంలో గుండెపోటుతో మరణించిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఉన్నం శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అమ్మనబ్రోలు గ్రామ సర్పంచ్ బత్తుల రవీన తండ్రి బత్తుల కొండయ్య క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతుండగా, పరామర్శించారు. త్వరగా కోలుకునేలా చికిత్స తీసుకోవాలని సూచించారు. మేరుగు వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఇనగంటి పిచ్చిరెడ్డి, నాయకులు కంచర్ల సుధాకర్, పోలినేని కోటేశ్వరరావు, పోలవరపు శ్రీమన్నారాయణ, వాకా కోటిరెడ్డి, జెడ్పీటీసీలు వేమా శ్రీనివాసరావు, తేళ్ల పుల్లారావు, కోయి హనుమయ్య, కుమ్మారి సుధాకర్, కాటూరి ఆదియ్య, మాదాసు రాంబాబు, ఉప్పుగుండూరు శ్రీనివాస ప్రసాద్, పేరాల చెన్నకేశవులు, బాలకృష్ణ, కొలకలూరి విజయ్‌కుమార్, పక్కెల వజ్రంబాబు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

మండవ అప్పారావుకు మాజీ మంత్రి మేరుగు పరామర్శ

మద్దిపాడు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ మద్దిపాడు మండల అధ్యక్షుడు మండవ అప్పారావును మాజీ మంత్రి, పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున గురువారం మధ్యాహ్నం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఆయన వెంట పార్టీ మద్దిపాడు మండల కార్యదర్శి వాకా కోటిరెడ్డి, నాయకులు తెల్ల పుల్లారావు, చీమకుర్తి జెడ్పీటీసీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ పద్మ, పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురికి పదవులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో అనుబంధ విభాగాల అధ్యక్షులు వరుసగా..యూత్ వింగ్ అధ్యక్షునిగా మల్లిశెట్టి శ్రీనివాస అయ్యప్ప (దేవా), మహిళా విభాగం అధ్యక్షురాలిగా బడుగు ఇందిర, రైతు విభాగం అధ్యక్షుడిగా కాట్రగడ్డ సురేష్‌బాబు, బీసీ సెల్ అధ్యక్షునిగా కొక్కిలిగడ్డ పూర్ణచంద్రరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా దేవరపల్లి రమణయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా పేరం ప్రసన్న, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ బాజీ, క్రిష్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా స్వర్ణ శ్యామ్ సాగర్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా వెమల శ్రీకాంత్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా దేవరపల్లి కోటేశ్వరరావు, మునిసిపల్ వింగ్ అధ్యక్షుడిగా మొహ్మద్ ఇమ్రాన్ ఖాన్, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడిగా కాళహస్తి వెంకట శేషాద్రి, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడిగా ఎస్.జనార్దన్‌రెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా పులుసు సురేష్‌బాబు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా అప్పల నాగరాజు, వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా అడిగొప్పుల రవిబాబు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా దాసరి రమేష్, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలిగా వడ్లమూడి వాణి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా డి.హరిబాబు, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా మిట్నసల శాంతారావు, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా కొల్లాం సత్యజిత్‌రాయ్, ఐటీ వింగ్ అధ్యక్షుడిగా సాలె మహేష్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా వల్లంరెడ్డి అంజిరెడ్డి, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడిగా డాక్టరు జాలాది మణిబాబు, ఇంటిలెక్చువల్ ఫోరం వింగ్ అధ్యక్షుడిగా పాలవల్లి వెంకట నరసింహం, బూత్ కమిటీస్ వింగ్ అధ్యక్షుడిగా కొల్లాం కార్తీక్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కఠారి సాయి సంజీవ్‌కృష్ణలను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం తెలిపింది.

సత్యనారాయణరెడ్డికి వైఎస్సార్ సీపీ నేతల నివాళి



సత్యనారాయణరెడ్డికి నివాళులలర్పిస్తున్న చుండూరి రవిబాబు

కొత్తపట్నం: ఎస్ఎస్ఎన్ సాల్ట్, మానిప్యాక్చర్, ఎస్ఎస్ఎన్ ఆక్వాఫామ్స్ అధినేత, వైఎస్సార్ సీపీ అభిమాని కుంతూరి సత్యనారాయణరెడ్డి ఈ నెల 7వ తేదీన మృతి చెందారు. తను నివాసం కొత్తపట్నంలో గురువారం పెద్దకర్మ సందర్భంగా ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, సీనియర్ నాయుకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు కటారి శంకర్, అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, ఈతముక్కల మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి పలువురు ముఖ్య నేతలు నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. ఆయన పేదరికంలో ఉంటూ కష్టపడి పనిచేసి అంచెలంచెలుగా ఎదిగారన్నారు.

చుండూరును కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు







చుండూరు రవిబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు

ఒంగోలు సిటీ: ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో నూతనంగా నియమితులైన అనుబంధ విభాగాల అధ్యక్షులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి చుండూరు రవిబాబును గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతనంగా నియమితులైన యూత్ వింగ్ అధ్యక్షుడు మల్లిశెట్టి శ్రీనివాస అయ్యప్ప, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు వేమల శ్రీకాంత్, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు వడ్లమూడి వాణి, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు పేరం ప్రసన్న, లీగల్ సెల్ వింగ్ అధ్యక్షుడు డి.హరిబాబు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు పులుసు సురేష్‌బాబు, వలంటీర్స్ వింగ్ అధ్యక్షుడు ఎస్.జనార్దనరెడ్డి, ఆర్టీఐ వింగ్ అధ్యక్షుడు కాళహస్తి వెంకట శేషాద్రి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవరపల్లి రమణయ్య, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు కఠారి సాయి సంజీవ్ కృష్ణలు ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చుండూరు రవిబాబు శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావును శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన వారు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలన్నారు. జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మద్దిపాడులో జాబ్ మేళా

మద్దిపాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మద్దిపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 25వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజ తెలిపారు. రిలయన్స్ డిజిటల్, ఐసీఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్, తారిక మేనేజ్‌మెంట్ సర్వీసెస్, శ్రీరామ్ చిట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. రిలయన్స్ డిజిటల్ సేల్స్ అసోసియేట్‌కు విద్యార్హత ఇంటర్ కాగా, జీతం రూ.12 వేల నుంచి రూ.18 వేలు ఉంటుందన్నారు. ఐసీఐసీఐ లొంబార్డ్ బీమా కంపెనీలో సేల్స్ మేనేజర్‌కు ఏదైనా డిగ్రీ కాగా, జీతం ఏడాదికి రూ.2.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఉంటుందన్నారు. తారిక మేనేజ్‌మెంట్ సర్వీసెస్లో టెలీకాలర్స్ ఉద్యోగానికి విద్యార్హత ఇంటర్ కాగా, జీతం రూ.10,000 నుంచి రూ.15,000 ఉంటుందన్నారు. శ్రీరామ్ చిట్స్ లో మార్కెటింగ్ జాబ్‌కు విద్యార్హత ఏదైనా డిగ్రీ కాగా, జీతం రూ.16,000 ఉంటుందని తెలిపారు.

చుండూరిని సన్మానించిన శాంతారావు



చుండూరి రవిబాబును సన్మానిస్తున్న శాంతారావు

కొత్తపట్నం: వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా మిట్నసల శాంతారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఒంగోలు అసెంబ్లీ నియోజికవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చుండూరి రవిబాబును శాంతారావు ఘనంగా సన్మానించారు. అనంతరం చుండూరికి శాంతారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ శాంతారావు అనేక పౌరాణిక నాటకాలు ప్రదర్శించి గొప్పపేరు తెచ్చుకున్న వ్యక్తన్నారు. గ్రామీణ ప్రాంతంలో చిన్న గ్రామంలో పుట్టి పెరిగి కళాకారుడిగా నియోజకవర్గ స్థాయికి ఎదిగి గొప్ప పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కళాకారుల సమస్యలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాడన్న నమ్మక తనకు ఉందన్నారు. ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, ఒంగోలు వైఎస్సార్ సీపీ సిటీ ప్రెసిడెంట్ కటారి శంకర్, సీనియర్ నాయకుడు వీరేపల్లి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్, ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల రవీంద్రరెడ్డి. ఈతముక్కల మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డిలు శాంతారావుకు అభినందనలు తెలిపారు.

నేతాజీ ధైర్యసాహసాలు యువతకు స్ఫూర్తి



నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



సుభాస్ చంద్రబోస్‌కు నివాళులర్పిస్తున్న వెంకటశేషారావు, ఉపాధ్యాయులు

నాగులుప్పలపాడు: ఆజాద్ హింద్ ఫౌజ్ పేరుతో స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించి యువతను చైతన్యపరచడంలో ముందు నిలిచిన నేత సుభాష్ చంద్రబోస్ అని ఈదుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పోలూరి శంకరరావు కొనియాడారు. నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేతాజీ గొప్ప దేశ భక్తుడని, ఆయన బ్రిటీష్ సైన్యాన్ని ఎదిరించి పోరాటం చేసిన తెగువ కలిగిన నాయకుడని అన్నారు. కార్యక్రమంలో గాధంశెట్టి శ్రీనివాసరావు, కామిశెట్టి శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ట్రైనింగ్ కమిషనర్ కొణిజేటి వెంకటశేషారావు అన్నారు. స్థానిక బొమ్మిశెట్టి సీతెమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నిమిషం పాటు మౌనం పాటించారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ఆకస్మిక తనిఖీ

మదనూరు (కొత్తపట్నం): మడనూరు స్వర్ణాంధ్ర పట్టపుపాలెంలో గురువారం జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి టి.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అంటే డయాల్‌సిస్ చేయించుకుంటున్న బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న క్లోరినేషన్, ఇతర నీటి సంబంధిత, కీటక జనిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. ఎల్‌డీసీ కార్యక్రమంలో భాగంగా రంగు రంగు మచ్చలు, శరీరంపై స్పర్శలేని బుడిపెలు తదితర లక్షణాలు కలిగిన వారిని గుర్తించడంలో ఆరోగ్య సైనికలు, ఆశాలు ప్రణాళికబద్ధమైన సర్వే నిర్వహించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.నవ్యరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందితో నీటి వనరుల క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించారు. సూపర్‌వైజర్ తంబి పద్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.